క్లుప్తంగా

అదనపు బస్సు ప్రారంభం



కోడేరు: మండల కేంద్రంలో వనపర్తి నుంచి వయా రేముద్దుల మీదుగా కోడేరు వెళ్లే అదనపు బస్సును శుక్రవారం మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు కృషితో బస్సు ఏర్పాటు చేశారని దీంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. సింగాయిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్యగౌడ్, ఆది కొమ్ము దానయ్య, రామకృష్ణ, మాజీ వార్డు సభ్యులు రాజు, శరత్, బాబు, బాలరాజుయాదవ్, సురేష్, జగన్, భరత్, పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

ఉప్పునుంతల: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హెచ్‌ఎస్‌లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యసన ఫలితాలపై కాంప్లెక్స్ కార్యదర్శి విజయకుమార్ అవగాహన కల్పించారు. పలు బోధనాంశాలపై చర్చించారు. ఎంఈఓ షర్పుద్దీన్, సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధన కోసం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు



లింగాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో పీఎం జన్మన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చెంచులు, వారి పిల్లలకు ఆధార్ కార్డు లేక పోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మండలంలోని అంబట్‌పల్లి, అప్పాయపల్లి, అవుసలికుంట, క్యాంపురాయవరం, రాయవరం, కొత్తకుంటపల్లి, లింగాల, పద్మన్నపల్లి, పాతదారారం, దారారం, పాత రాయవరం, ఎర్రపెంట, కొత్త చెర్వుతండా పెంటల నుంచి ఉదయం నుంచే రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. ఆధార్ నమోదు మొదటి రోజు కావడంతో కొంత ఆలస్యంగా ప్రారంభం కావడంతో చెంచులు అసౌకర్యానికి గురయ్యారు. కార్యక్రమంలో ఐటీడీఏ, ఆధార్ నమోదు సిబ్బంది పాల్గొన్నారు.

కౌండిన్య దళం నూతన కమిటీ ఏర్పాటు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో కౌండిన్య దళం కమిటీ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా అధ్యక్షుడిగా టి ఉదయ్‌గౌడ్, గౌరవాధ్యక్షుడిగా ప్రసాద్‌గౌడ్, సాయికుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, బిచ్చన్న గౌడ్, ప్రధాన కార్యదర్శిగా భరత్‌గౌడ్, కోశాధికారిగా రవీందర్‌గౌడ్, కార్యదర్శులుగా సురేందర్‌గౌడ్, మాసయ్య గౌడ్, సత్యం గౌడ్, రాజగౌడ్, శివగౌడ్‌లను ఎన్నుకున్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు శుక్రవారం ఇరుముడి కట్టుకొని శబరిమలయకు తరలివెళ్లారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పనామస్మరణ మార్మోగింది. అనంతరం వాహనాల్లో శబరికి తరలివెళ్లారు. గురుస్వాములు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో నరేష్ అనే యువకుడు బైక్‌ను శుక్రవారం మధ్యాహ్నం పార్క్ చేశాడు. బైక్ నుంచి పెట్రోల్ లీక్ కావడంతో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గమనించిన దుకాణదారులు వెంటనే నీటిని చల్లి మంటలను ఆర్పారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



కల్వకుర్తి మండలం బెక్కెరలో



తెలకపల్లిలో..



బల్మూర్ మండలం విరంరాజ్‌పల్లిలో

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

కల్వకుర్తిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండలంలోని వెంకటాపూర్‌లో 324, జంగారెడ్డిపల్లిలో 275, తర్నికల్ తండాలో 313, బెక్కెరలో 211 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని బండపల్లి 167, రాంరెడ్డిపల్లిలో 176, గౌతంపల్లిలో 225, పర్వతాపూర్‌లో 205 దరఖాస్తులు అందాయి. అదే విధంగా గ్రీవెన్స్ కింద బండపల్లిలో 57, రాంరెడ్డిపల్లిలో 49, గౌతంపల్లిలో 63, పర్వతాపూర్‌లో 55 మొత్తం 224 గ్రీవెన్స్ దరఖాస్తులు వచ్చానట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని రాంనగర్, పొలిశెట్టిపల్లి,



పెద్దకొత్తపల్లి నక్కలపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



తాడూరు మండలం నాగుదేవుపల్లిలో

మంగళకుంటపల్లి, వీరంరాజ్‌పల్లి గ్రామాల్లో మొత్తం 1105 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ దేవన్న తెలిపారు. ఇందులో 867 ఆరు గ్యారంటీకులకు సంబంధించినవి ఉన్నాయని మిగతా 238 దరఖాస్తులు పలు సమస్యలపై దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీమొద్దిన్, అధికారులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు గుట్టలపల్లి, యత్మతాపూర్, లచ్చిరాం తండా, పర్వతాయిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లి, ఆదిరాల, నారాయణపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సర్పంచ్ రాధిక, ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, ఎంపీటీసీ రవికుమార్, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో ఆరు రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలనలో ప్రజల నుంచి మొత్తం 12,747 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. పంచాయతీ వారిగా జాబితాను తయారు చేసి ఆన్‌లైన్‌లో ఉంచుతామని పేర్కొన్నారు.

మంత్రి జూపల్లి మార్నింగ్‌వాక్

కొల్లాపూర్: పట్టణంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం మార్నింగ్ వాక్ చేశారు. ప్రధాన వీధులగుండా తిరుగుతూ స్థానికులతో మాట్లాడారు. జగ్జీవన్‌రామ్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తాలో డివైడర్ పనులు, ఫుట్‌పాత్ నిర్మాణ పనుల గూర్చి మున్సిపల్ కమిషనర్ రాజయ్యతో ఆయన మాట్లాడారు. రోడ్డు వెంట ఉండే చిరువ్యాపారులతో ముచ్చటించారు. 18,19 వార్డుల్లో స్థానిక సమస్యలను పరిశీలించారు. అనంతరం కొల్లాపూర్ డిపోకు నూతనంగా మంజూరైన ఆర్టీసీ బస్సును మంత్రి ప్రారంభించారు. అదే బస్సులో సింగోటం వరకు ప్రయాణించారు. అంతకు ముందు మంత్రిని రైస్‌మిల్ అసోసియేషన్ నాయకులు, అంగన్‌వాడీ ఉద్యోగులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, కౌన్సిలర్లు నర్సింహ్మారావు, రహీంపాషా, డాక్టర్ రాముడుయాదవ్, మేకల శిరీషయాదవ్, నాయకులు ధరణిపతి శ్రీనివాసరావు, మేకల నాగరాజు, వంగ రాజశేఖర్‌గౌడ్, పసుపుల నర్సింహ్మా, ఎక్బాల్, వేణుగోపాల్‌యాదవ్, కేతూరి ధర్మతేజ తదితరులున్నారు.



కొల్లాపూర్‌లో మార్నింగ్‌వాక్‌లో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కల్వకుర్తిరూరల్: మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లోని మంత్రి నివాసంలో సన్మానించారు. అనంతరం నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఆకుతోట నవీన్‌కుమార్, సాయిరాజ్, వజ్రలింగం, శేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, పాపిశెట్టి శ్రీనివాస్, రాంరెడ్డి, ప్రవీణ్, లింగం, రాజు, కృష్ణయ్య, వెంకటేష్, విజయ్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అచ్చంపేట రూరల్: పట్టణంలో ఎస్టీయూ, పీఆర్‌టీయూ, పలు సంఘాలకు సంబంధించిన నూతన క్యాలెండర్లు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ల సుదర్శన్, శ్రీధర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, బీచ్యానాయక్ పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ నాయకులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బిచ్చానాయక్, మల్లికార్జున్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బాలస్వామి, శ్రీకాంత్, భోగరాజు చంద్రశేఖర్, సాజిద్, పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర బాధ్యులు అర్జున్‌గౌడ్, సీవీ రావు, రంగినేని శ్రీధర్, శ్రీనివాసులు, నరసింహా, రామకృష్ణ, ప్రభావతి, స్వప్న, భాగ్యమ్మ, నారాయణరెడ్డి, సీఆర్‌పీ రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డి భవనంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను నియోజకవర్గ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. కార్యదర్శి జైపాల్‌రెడ్డి, రెడ్డి సేవా సమతి మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అచ్యుతారెడ్డి, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు రంగారెడ్డి, అనురాధ, సర్పంచ్‌లు సరిత, పుష్పావతి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కల్వకుర్తి: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఎమ్మెల్యేకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. కోర్టు ఆవరణ పూర్తిగా దెబ్బతినటంతో నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బ్యాంక్‌ల సేవలపై అవగాహన



బల్మూర్: మండల కేంద్రంలో శుక్రవారం భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా బ్యాంక్ ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ పవన్ మాట్లాడారు. బ్యాంక్ సేవలపై అవగాహన ఉండాలన్నారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది లావాదేవీలు, వాటి వినియోగం, చెల్లింపులపై అవగాహన కల్పించారు. సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా ఆనంద్‌గౌడ్

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర (ఉమ్మడి) మండలాల క్రికెట్ అసోసియేషన్‌ను శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా నోముల ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జబ్బు పెద్దిరాజుయాదవ్ లతో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పెద్దకొత్తపల్లి: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని పాలెం ఉద్యానవన శాఖ అధికారి ఆదిశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్వకోలు రైతువేదికలో మామిడి తోటల్లో చేపట్టే యాజమాన్య పద్ధతులు, వరిలో డ్రమ్‌సీడర్ వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కొల్లాపూర్ ఉద్యానవనశాఖ అధికారి లక్ష్మణ్ డ్రమ్ సీడర్ ద్వారా వరిపంట సాగు గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త రామకృష్ణ ఆయిల్‌పాం సాగు యాజమాన్య పద్ధతులను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఏడీఏ రవి, వ్యవసాయాధికారి శిరీష, ఏఈఓ ప్రదీప్, సర్పంచ్‌లు ఉజ్వల, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, ఎంపీటీసీ లక్ష్మీదేవమ్మ, వెంకటస్వామి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాము, వెంకటస్వామి, ధర్మారెడ్డి, మదనగోపాల్, నర్సింహా పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఆదిశంకర్

విద్యుత్ తీగలు మార్చాలని వినతి

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో ఇళ్లమధ్యలో ఉన్న 11కేవీఏ విద్యుత్ తీగలను మార్చాలని శుక్రవారం గ్రామస్తులు మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ వైర్లు ఇళ్ల మధ్యలో ఉండడంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దాదాపుగా 30ఏళ్ల క్రితం 11కేవీఏ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశారని, స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వివరించారు. అనంతరం కార్యాలయంలో సబ్‌ఇంజనీయర్‌కు అంకితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, అశోక్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



మినీ ట్యాంక్‌బండ్‌ను సుందరీకరిస్తాం



అచ్చంపేటలో మల్లంకుంట మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: పట్టణంలో పార్కుల ఏర్పాటుతో పాటు మినీ ట్యాంక్‌బండ్‌ను సుందరీకరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలో గుడ్‌మార్నింగ్ అచ్చంపేటలో భాగంగా మల్లంకుంట మినీ ట్యాంక్‌బండ్ పరిసరాలను ఆయన పరిశీలించారు. స్థానికులతో ముచ్చటించారు. మల్లంకుంట ప్రాంతం, మినీ ట్యాంకుబండ్ కట్ట ప్రాంతంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజల సహకారంతో మల్లంకుంటను అన్ని రకాలుగా సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఏడాదిలోగా పూర్తిస్థాయిలో మినీ ట్యాంక్‌బండ్ అందుబాటులోకి తెస్తామన్నారు. అచ్చంపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, 'ఐలవ్ అచ్చంపేట' అనే విధంగా సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. మినీ ట్యాంక్ బండ్‌కు సంబంధించిన వివరాలను ఇరిగేషన్ ఏఈ రమేష్‌తో అడిగి తెలుసుకున్నారు. కాగా మినీ ట్యాంకు బండ్ పరిశీలన చేస్తున్న క్రమంలో దుర్వాసన భరించలేక ప్రజాప్రతినిధులు, అధికారులు ముక్కు మూసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, ఇరిగేషన్ ఏఈ రమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెంచుల ఆరోగ్యంపై శ్రద్ధ

కొల్లాపూర్ రూరల్: చెంచుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జిల్లా వైద్య అధికారి సుధాకర్‌లాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమరగిరి చెంచు గూడెంలో పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అమరగిరి, చెంచుగూడెం, పెంటలలో ఉన్న చెంచులకు ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం శిబిరంలో 46 మందికి బీపీ, పలు రక్త పరీక్షలు చేశామన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్, డీపీఓ రేణయ్య, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసులు, రామ్మోహన్, తదితర అధికారులు, సిబ్బంది, చెంచులు పాల్గొన్నారు.



ఔషధాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

శ్రీరామ దివ్య అక్షతల పంపిణీ



మన్ననూరులో అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాములలో రామజన్మభూమి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ దివ్య అక్షతలను ఇంటింటికి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన అయోధ్యలో బాల రాముడి దివ్యప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంటిలో శ్రీరాముడి చిత్రపటానికి అక్షతలతో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంకాలం ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నిర్మల, బాలమణి, రాజేశ్వరీ, నర్మద, యోగా గురువు భాను ప్రకాశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాముడు, సాతాని శ్రీను, శివ, విష్ణు, శేఖర్, బాలరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని విద్యానగర్, గాంధీనగర్, శివాలయం వీధిలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి అయోధ్య రాముడి అక్షతలను పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ మహిళా కార్యదర్శి సుకన్య ఆధ్వర్యంలో మహిళలు హనుమాన్ దేవాలయం నుంచి శివాలయం వరకు శ్రీరామకీర్తనలు, పాటలు, భజనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. విద్యానగర్‌లో మహిళా నాయకురాలు శ్వేతా రెడ్డి, కల్పలక్ష్మి, ప్రభావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో గడప గడపకు అయోధ్య శ్రీరాముడి అక్షలను పంపిణీ చేశారు. అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యులు ఉమాపతి ఆచార్యులు, శంకరయ్య, శ్రీరాములుగౌడ్, రామకృష్ణ, నరేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక అంబేద్కర్ కాలనీలో ఇంటింటికి అయోధ్య రాముడి అక్షతలను పంపిణీ చేశారు. మన్ననూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య సమాచారం, ప్రతిమలను అందజేశారు. సంబు శోభ, జయమ్మ, సరస్వతి, ప్రభావతమ్మ, పార్వతమ్మ, రామేశ్వరమ్మ, స్వయం సేవకులు శ్రీనివాసులు, చంద్రమౌళి, అజయ్, నాగరాజు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని గోదల్‌లో భ్రమరాంబ భజన కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షతలను ఇంటింటికి పంపిణీ చేశారు.

అభివృద్ధిలో భాగస్వాములమవుదాం

తాడూరు: నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములవుదామని జెడ్పీటీసీ రోహిణి అన్నారు. శుక్రవారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ఎజెండాలను చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల ప్రజప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు తరుచూ లీకేజీలు కావడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని లీకేజీలను ఎందుకు సరిచేయడం లేదని సర్పంచ్‌లు అధికారులను నిలదీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్ రెడ్డి స్పందిస్తూ లీకేజీ అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, రైతుబంధు, వివిధ సమస్యలను సభ్యులు లేవనెత్తారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ప్రమిల, వైస్ ఎంపీపీ శివలీల, సింగిల్ విండో చైర్మన్ సమ్మద్ పాషా, ఎంపీడీఓ గంగమోహన్, ఏఓ సాయిరమేష్ కుమార్, వెటర్నరీ డాక్టర్ రాజేష్‌కుమార్, ఇంద్రకల్ సర్పంచ్ రమణ, ఎంపీటీసీ కర్ణాకర్, రేణుక, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రోహిణి

ఆకట్టుకున్న అంబేద్కర్ నాటక ప్రదర్శన

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సంఘం శరణం గచ్చామీ పేరుతో నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, నిమ్నజాతుల హక్కుల కోసం చేసిన పోరాటాలు, దేశ సేవలను ప్రదర్శించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కిషోర్ ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంబేద్కర్ వేషధారణతో ఉన్న వ్యక్తి ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. రైతు సంఘం గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు మల్లయ్య, పరుశురాముడు, యూసూఫ్‌బాబ, గణేష్, గౌసుద్దీన్, భాస్కర్, ఖాజామైనుద్దీన్, వీరయ్య, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ వేషధారణలో ఉన్న వ్యక్తితో గ్రామస్తులు

ఆర్టీసీ డిపోలో వనభోజనాలు



కల్వకుర్తి టౌన్: ప్రతి ఉద్యోగి ప్రశాంత వాతావరణంలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది కలిసి వనభోజనాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులు ఆహ్లాదరకమైన వాతావరణంలో గడిపేందుకు యాజమాన్యం వనభోజనాలు లాంటి కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులకు వివిధ ఆటలు, పాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో డిపో సీఐ శ్వేత, ఎంఎఫ్ సురేందర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తండావాసికి డాక్టరేట్

చారకొండ: మండలంలోని బోడబండ తండాకు చెందిన సబావత్ శ్రీను నాయక్‌కు డాక్టరేట్‌తో సత్కరించారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో పర్యావరణ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన ప్రయోగాలను గుర్తింపుగా డాక్టరేట్ అందుకున్నారు. జేఎన్‌టీయూ 12వ స్నాతకోత్సవంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహరెడ్డి, ఇస్రో చైర్మన్ సోమనాథ్‌లు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ నాయక్, బంధువులు, స్నేహితులు డాక్టరేట్ పొందిన శ్రీను నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపూర్ గ్రామానికి చెందిన ప్రొఫెసర్ ఎన్నోజి రవికుమార్ ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్‌ను పొందాడు. ఎంఎల్‌ఆర్ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావు పర్యవేక్షణలో సీక్వెన్షియల్ పాట్నర్స్ మైనింగ్ ఓవర్ ల్యాండ్‌డాట్ సెర్చ్ ఎస్టిమల్ ఫ్రేమ్‌వర్క్ అనే అంశాలపై పరిశోధనలు చేశారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ 12వ స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ సోమనాథ్ ఆయనకు డాక్టరేట్ అందజేశారు. సర్పంచ్ సత్యం, ఎంపీటీసీ ప్రతాపరెడ్డి, రవికుమార్‌ను అభినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీను నాయక్

నామమాత్రంగా సింగోటం ఉత్సవాలపై సమీక్ష



కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని సింగోటం లక్ష్మీనరసింహ్మా స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై నామమాత్రంగా చర్చించి ముగించారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి జూపల్లి కృష్ణారావు దేవాలయానికి వస్తున్న ఆదాయంపై సమీక్షించకపోవడం సరికాదన్నారు. దేవాలయం అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆలయ అభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధిలేదన్నారు. ఆలయానికి ఎంత ఆదాయం వస్తుందో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వేణు, రంగస్వామి ఉన్నారు.